## తల్లీ కొడుకుల అదృశ్యం

మేడ్చల్, మే 25 : కొడుకుతో సహా తల్లి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన మన్నె సత్యనారాయణ భార్య మన్నె స్వప్న(26)ఈనెల 18వ తేదీన ఎల్లంపేటలోని తన నివాసం నుంచి పని ఉందని తన కొడుకు(6)ను తీసుకొని బయల్దేరింది. ఇలా ఇంటి నుంచి బయటికి వెళ్లిన స్వప్న తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు శనివారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భర్త వేధింపులు తాళలేక.. భార్య బలవన్మరణం



శ్వేత(ఫైల్)

జవహర్‌నగర్, మే 25: వారు ప్రేమ వివాహం చేసుకుని మూడేండ్లుగా ఎంతో అన్యోన్యంగా ఉంటూ కుమార్తె(2)తో సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. ఇటీవల భర్త మద్యానికి బానిసైనా చేసిన అప్పులు తీర్చాలని భార్యను వేధించడం మొదలుపెట్టాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన ఆ మహిళకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన జహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి బీజేఆర్‌నగర్‌లో చోటుచేసుకున్నది. సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య తెలిపిన ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్ బీజేఆర్‌నగర్‌లో చంటి, భార్య శ్వేత(25), రెండేండ్ల కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. చంటి గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మౌలాలి హౌజింగ్‌బోర్డు ప్రాంతానికి శ్వేత(25)అలియాస్ అమ్ములును చంటి మూడేండ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు.

ఇద్దరు అన్యోన్యంగా జీవనం సాగిస్తుండగా.. మద్యానికి బానిసైన చంటి అప్పులు చేశాడు. ఆ అప్పులను తీర్చాలని భార్య శ్వేతను వేధింపులకు గురిచేసేవాడు. ఇటీవల వేధింపులు ఎక్కువ కావడంతో మనస్థాపం చెందిన శ్వేత ఆదివారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. భర్త చంటి వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# జోరుగా అక్రమ నిర్మాణాలు

**పోచారం మున్సిపాలిటీలో కిందిస్థాయి సిబ్బంది చేతివాటం.. పట్టించుకోని అధికారులు**

పోచారం, మే 25: పోచారం మున్సిపాలిటీలోని అన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతున్నది. కిందిస్థాయి సిబ్బంది చేతివాటం, అధికారులు పర్యవేక్షణ లేని కారణంగా అక్రమ నిర్మాణ దారులు జోరు పెంచారు. కొంత మంది నిర్మాణ దారులు మున్సిపాలిటీ నుంచి భవనాల నిర్మాణం కోసం జీ ప్లస్-2 అనుమతి తీసుకొని ఐదు నుంచి ఆరు అంతస్తుల వరకు నిర్మాణాలు జరుపుతున్నారు. మరికొంత మంది నిర్మాణదారులు అప్పట్లో ఉన్న ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో ఉండి మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాలను చేపడుతున్నారు. దీంతో మున్సిపాలిటీకి చెందిన టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపాలిటీ అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతుందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇన్ఫోసెస్ ప్రాంతంలో, అన్నోజిగూడ, చౌదరిగూడ, నారపల్లి, పోచారం, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యాంనంపేట్ వెంకటాపురం, కాచివాని సింగారం, జోడిమెట్ల, వరంగల్ ప్రధాన రహదారికి ఇరువైపులా ఈ అక్రమ నిర్మాణాలు జోరుగా వెలుస్తున్నాయి. అక్రమ నిర్మాణాల కారణంగా భవిష్యత్‌లో మౌలిక వసతుల కల్పనలో మున్సిపాలిటీకి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉన్నా అధికారులు ఎందుకు ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోచారం మున్సిపాలిటీలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణలపై చర్యలు తీసుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.



పోచారం మున్సిపాలిటీ ఇన్ఫోసెస్ వద్ద నిర్మిస్తున్న బహుళ అంతస్తు భవనం

## ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిత్య పూలమాల



ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఘట్‌కేసర్, మే 25: అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో చేపట్టిన నిత్య పూలమాల కార్యక్రమం 215వ వారానికి చేరుకున్నది. ఘట్‌కేసర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ పట్టణ పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు భోగ అర్జున్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మేకల దాసు, రాందాసు, సత్యం, రాజేశ్ కుమార్, వెంకటేశ్వర్లు, గణేశ్, కృష్ణంరాజు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుడు దశరథ్ సేవలు మరువలేనివి

రామంతాపూర్, మే 25: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దశరథ్ సేవలు మరువలేనివని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హబ్సిగూడ డివిజన్ వెంకట్‌రెడ్డినగర్‌లో నిర్వహించిన దశరథ్ దశదిన కర్మలో పాల్గొని ఆయన మాట్లాడారు. దశరథ్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుధాకర్ చారి, ఈగ సంతోష్, మల్లేశ్, హనుమంత్, శరత్, నాగరాజు, జగన్, అనిల్, ఈశ్వర్, వెంకటేశ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ నాయకుడు దశరథ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

## వైభవంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం

**హాజరైన ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి**



శీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్,ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్, మే 25 : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో విష్ణుశౌర్య ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం కన్నులపండువగా సాగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వేంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి మెడలో మాంగళ్యధారణ చేశారు. హాల్ మొత్తం నమోః వేంకటేశాయ, గోవిందా అనే నామస్మరణతో మార్మోగింది. కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్-మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం, జగత్ రక్షణ కోసం కల్యాణాన్ని నిర్వహించే విష్ణు శౌర్యను అభినందించారు.

## అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం..

బోడుప్పల్, మే 25: బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నత్తి మైసయ్య అన్నారు. బోడుప్పల్ ప్రధాన కేంద్రంగా ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాలను ఆయన సమర్పించి నివాళులర్పించారు. గత 327 ఆదివారాలుగా కొనసాగుతున్న జ్ఞానమాల సమర్పణ కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అంబేద్కర్ కలలుకన్న కుల రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో చిన్నారుల కూచిపూడి నృత్యం

రామంతాపూర్, మే 25: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం గురువు పావని శ్రీలత ప్రసాద్ శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. రంగ పూజ, విన్నపాలు, పుష్పాంజలి, ఇదిగో భద్రాద్రి, శాంకరి శంకరుడు, నమశ్శివాయ, హిమగిరి, రామాయణ శబ్దం తదితర అంశాలను విముక్త, సుహాని, నిధ్విక, శాన్వి, చైత్ర, జెశ్వీత, దేవి లత, మాధవి, ఆధ్య, తరుణీ, అడవిత, సమన్విత, హంసిని ప్రదర్శించి ఆహుతులను మెప్పించారు.

# క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



జిల్లాస్థాయి పోటీలకు హాజరైన విద్యార్థులు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

శామీర్‌పేట, మే 25: శామీర్‌పేట తెలంగాణ క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం జరిగాయి. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 8, 10, 12 ఏండ్లలోపు బాల బాలికలు పాల్గొని పరుగు పందెం, షాట్ పుట్, జావెలిన్‌త్రో, లాంగ్ జంప్ తదితర పోటీల్లో తలపడ్డారు. ఈ సందర్భంగా కూరపాటి రాజశేఖర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి పోటీల్లోప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జూన్ మొదటి తారీకున హైదరాబాద్‌లో జరిగే 14వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ దయాళ్, టెక్నికల్ కమిటీ సభ్యుడు తిరుమల రావు, వివిధ పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అత్వెల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మేడ్చల్‌లో మున్సిపాలిటీ అత్వెల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2006-07 బ్యాచ్‌కి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో జరిగిన సమ్మేళనంలో పాల్గొని, మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. 18 ఏండ్ల తర్వాత కలవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. కుటుంబం, ఉద్యోగం, అప్పటి గురువులు, జరిగిన ఘటనలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు.

*– మేడ్చల్, మే 25*



## వాహనం ఢీకొని జింక మృతి



కందుకూరు, మే 25: రోడ్డు ప్రమాదంలో జింక మృతి చెందింది. హైదరాబాద్ శ్రీశైలం రహదారి పై మండల పరిధిలోని రాచులూరు గేటు సమీపంలో గల పెద్దమ్మ గుడి వద్ద వాహనం ఢీకొట్టింది. సమాచారం అందుకున్న గుమ్మడ వెల్లి ఫారెస్ట్ ఆఫీసర్ విజయ భాస్కర్ రెడ్డి, సంఘటనా స్థలానికి చేరుకొని రాచులూరు పశువైద్యాధికారి షాహిన్ షేక్‌కు సమాచారం అందజేసి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పోస్టుమార్టం చేసి ఫారెస్ట్ ఆఫీసర్‌కు అప్పగించారు. అనంతరం ఫారెస్ట్ ఆఫీసర్ విజయ భాస్కర్ రెడ్డి, గుమ్మడవెల్లి ఫారెస్ట్ భూమిలో పూడ్చిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల వెంట వెళ్లే వాహనాలు ఫారెస్ట్‌లో ఉన్నచోట నిదానంగా వెళ్లాలని సూచించారు. ప్రమాదం జరిగిన చోట సీసీ కెమెరాలు ఉన్నట్లయితే వాటిని పరిశీలించి వాహనాన్ని గుర్తిస్తామని పేర్కొన్నారు.

## ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలి



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసిన పెండ్యాల ఎస్సీ సంఘం నాయకులు

బడంగ్ పేట్, మే 25: మహేశ్వరం మండలం పరిధిలోని పెండ్యాల్ గ్రామం మాజీ సర్పంచ్ మంత్రి రాజేశ్ ఆధ్వర్యంలో పెండ్యాల్ ఎస్సీ సంఘం అధ్యక్షుడు యాచారం నరసింహ, కమిటీ నాయకులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పెండ్యాల్ ఎస్సీ కమిటీ హాల్ నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. తప్పకుండా కమ్యూనిటీ హాల్ ను కట్టిస్తానని మాట ఇచ్చారని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇస్తానందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యాచారం దశరథ, రవీందర్ , నర్సింగ్ రావు, ముత్యం , తొంట శ్రీకాంత్, సుమన్, గణేశ్, సత్య అశోక్ రెడ్డి, నరేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## వీరన్నగుట్ట కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

మన్సురాబాద్, మే 25:ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సహకారంతో వీరన్న గుట్ట కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి తెలిపారు. మన్సురాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరన్న గుట్ట కాలనీలో పార్క్ స్థలం అభివృద్ధి కోసం జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 30 వేల చెక్కును ఆయన కాలనీవాసులకు అందజేశారు.

## కరాటేలో అక్కా, చెల్లెల్లు వరల్డ్ రికార్డ్



వరల్డ్ రికార్డ్ సాధించిన అక్కా, చెల్లెళ్లతో కార్పొరేటర్లు మహాలక్ష్మి, అమృత, డాక్టర్ గోపాల్ రెడ్డి తదితరులు

కాచిగూడ, మే 25 :విదేశాల్లోనూ తెలంగాణ కరాటే విద్యార్థులు సత్తా చాటాలని హిమాయత్‌నగర్, నల్లకుంట కార్పొరేటర్లు మహాలక్ష్మి, అమృత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జీవీఆర్ కరాటే అకాడమీలో ఆదివారం అ క్కాచెల్లెళ్లు జి.అమృతారెడ్డి, జి.ఘన సంతోషినిరెడ్డి 11 నిమిషాల్లో పూర్తి చేయాల్సిన కరాటే ప్రదర్శన కేవలం 9:36 నిమిషాల్లో పూర్తిచేసి, 121 మెలుకువలను 11 విభాగాలు ప్రదర్శించి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి బింగి నరేందర్ గౌడ్, లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి లయన్స్ విజయలక్ష్మి ధృవీకరించి అక్కాచెల్లెళ్లకు సర్టిఫికెట్లను అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి, కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్, నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, సోమాజిగూడ కార్పొరేటర్ సంగీత యాదవ్, మొండ మార్కెట్ కార్పొరేటర్ దీపిక,సమాచార హక్కు మాజీ కమిషనర్ ఖలీలొద్దీన్, వివేక్ హాస్పటల్ ఎండీ డాక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ కార్డులతో ఆరోగ్య భద్రత



ఆయుష్మాన్ కార్డుల పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఏవీఆర్ మూర్తి

ఆర్కేపురం, మే 25 : కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండటం కోసం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డు ఎంతో ఉపయుక్తమైనదని బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ ఏవీఆర్ మూర్తి అన్నారు. ఆదివారం దిల్‌సుఖ్‌నగర్ లోని కమలానగర్ రామాలయం ప్రాంగణంలో బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ కార్డును ప్రతి ఒక్క బ్రాహ్మణుడు డౌన్‌లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని అందుకోసం బ్రాహ్మణ ఐక్యవేదిక ప్రత్యేకంగా ఈ కార్డులను డౌన్‌లోడ్ చేసి ఉచితంగా అందిస్తోందన్నారు. సుమారుగా 150 మందికి పైగా పాల్గొని కార్డు పొందినారని ఈ కార్డు ద్వారా దేశంలోని వివిధ కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సను పొందే అవకాశం ఉందని ఐదు లక్షల వరకు వైద్య ఖర్చులకు ఈ కార్డు ఉపకరిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి సోమేశ్వరులు, కార్యవర్గ సభ్యులు మోహనా చార్య, సరళ, పోపూరి శ్రీనివాస్, విజయభాస్కర్, ఏక శిరీష, అనిత, ఎస్ ఎస్ ఎన్ మూర్తి, వేమూరి ఆనంద్, మురళి, సురేశ్ పాల్గొన్నారు.

## బిల్లులు స్వాహా .. చర్యలు తీసుకోవాలి

సైదాబాద్, మే 25: సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్ లో ఎలాంటి పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేసిన జీహెచ్ఎంసీ అధికారులపై, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఐ ఎస్ సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానికంగా సీసీ రోడ్డు నిర్మాణం చేసినట్లు రికార్డులు సృష్టించి పది లక్షల రూపాయలు స్వాహా చేసి అవినీతికి పాల్పడ్డ వారిపై శాఖాపరమైన విచారణ జరిపించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించాలని ఆయన జీహెచ్ఎంపీ కమిషనర్‌ను కోరారు. సింగరేణి కాలనీ లో ప్రజలకు తాగునీటి కష్టాలను, పారిశుధ్య ఇబ్బందులను తొలగించడంలో అధికారులు పట్టించుకోవడంలేదని, కేవలం అవినీతికి పాల్పడడానికి వారు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు.

**PUBLIC NOTICE**

It is informed to all the public that my clients Konkala Anand S/o. K.Madanna & Konkala Vishwa Teja, S/o. Konkala Anand have been intended to purchase All that the Plot No. 127, admeasuring 244 Sq. Yards, situated at Ward No. 2, Block No. 2, situated at Cables Sramika Co-Operative Society, Cherlapally Village, Kapra GHMC Circle, Kapra Mandal, Medchal-Malkajgiri District., from its rightful owner M/s. Sai Shraddha Homes, rep. by its Managing Partner Sri. V. Srinivas.

In this regard, my client had paid token advance, and entered into agreement of sale, if any individual/ unit having any objections on the above said property may contact to the below address with the relevant documents personally or through their counsel within 15 days from the date of this publication. Otherwise, my client will intend sale transaction. Thereafter, if any disputes or claims will not be entertained and you are also liable for cost and consequences thereof.

Sd/- **R. SRUJANA**
Advocate
# Room No. 6, 4th Floor, Srinath Commercial Complex, S.D. Road, Patny Center, Secunderabad-03.
**Phone: 040-35738130**

**PUBLIC NOTICE**

It is informed to all the public that my clients Konkala Rithvik S/o.Konkala Anand & D. Prasanna W/o. Konkala Anand, have been intended to purchase All that the Plot No. 126, admeasuring 226.11 Sq. Yards, in Sy. No. 72 & 73, situated at Ward No. 2, Block No. 2, situated at Cables Sramika Co-Operative Society, Cherlapally Village, Kapra GHMC Circle, Kapra Mandal, Medchal-Malkajgiri District., from its rightful owner M/s. Sai Shraddha Homes, rep. by its Managing Partner Sri. V. Srinivas.

In this regard, my client had paid token advance, and entered into agreement of sale, if any individual/ unit having any objections on the above said property may contact to the below address with the relevant documents personally or through their counsel within 15 days from the date of this publication. Otherwise, my client will intend sale transaction. Thereafter, if any disputes or claims will not be entertained and you are also liable for cost and consequences thereof.

Sd/- **R. SRUJANA**
Advocate
# Room No. 6, 4th Floor, Srinath Commercial Complex, S.D. Road, Patny Center, Secunderabad-03. **Phone: 040-35738130**